క్లుప్తంగా

నారసింహ యాగం



కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని బాగ్‌అమీర్‌లోని కోదెల లక్ష్మీనరసింహస్వామి, శోభరాణిలు నిర్వహించిన నారసింహయాగంలో గొట్టిముక్కల పద్మారావు ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుదర్శన యాగం అంటే లోక కల్యాణం కోసం అని ఆయన పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: దీనబంధు కాలనీకి చెందిన శ్రీ కృష్ణ కుమార్ అత్యవసర చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన రూ.2లక్షల ఆర్థిక సాయాన్ని ఆదివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రఘుపతిరెడ్డి, వివేకానందనగర్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు కోనేరు ప్రసాద్, రఘునాథ్, చంద్రమోహన్ సాగర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు జోగిపేట భాస్కర్ మాతృమూర్తి సక్కుబాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం ఆమె దశదిన కర్మ ఆయన స్వగృహంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వాసుదేవరావు, సాయిగౌడ్, బాలరాజ్, తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న వడ్డేపలి రాజేశ్వరరావు, మాధవరం కాంతారావు

మోతీనగర్: గాయత్రినగర్‌లో మేడ్చల్ జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు పులిగొళ్ల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కూకట్‌పల్లి బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపలి రాజేశ్వరరావు, మాధవరం కాంతారావులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభిచారు. కార్యక్రమంలో పులిగొళ్ల శ్రీలక్ష్మీయాదవ్, డివిజన్ అధ్యక్షుడు విజయ్, ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, ఉపాధ్యక్షులు శ్రావణ్, కృష్ణంరాజు, కృష్ణశర్మ, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీసీఆర్ సంస్థ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం



హాజరైన మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల ఇన్‌చార్జ్‌లు సుబ్రహ్మణ్యం, అశోక్‌కుమార్

సుభాష్‌నగర్: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా సీసీఆర్ సంస్థ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సూరారంలో జిల్లా ఇన్‌చార్జ్ సుబ్రహ్మణ్యం, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ అశోక్‌కుమార్‌ల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సంస్థ సభ్యులకు సంస్థ ఆలోచన విధానాలపై అవగాహన కల్పించి దిశానిర్దేశం చేశారు. అదే విధంగా జిల్లా కలెక్టర్‌ను కలిసి ఆర్టీఐ బోర్డ్ మీద ఇచ్చిన పిటిషన్‌కు పలు ప్రభుత్వ ఆఫీసుల నుంచి వచ్చిన సమాధానాలు, తదుపరి నిర్ణయాలను, సంస్థ ఆలోచన విధానాల్ని తెలియజేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నిజాంపేట్: ప్రజలకు మెరుగైన పాలన అందించే దిశగా పని చేస్తున్నామని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన్ 13వ డివిజన్ పరిధిలోని కేటీఆర్ కాలనీలోని 5, 6 గల్లీల వాసులు మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ గల్లీలో ప్రతి వర్షాకాలం వరదనీరు చేరడంతో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. డ్రెయిన్ నాలాను నిర్మించి సమస్యను పరిష్కరించాలని కోరగా సానుకూలంగా స్పందించారు. బీఆర్‌ఎస్ నాయకుడు చంద్రగిరి సతీష్, కేటీఆర్ కాలనీ ప్రెసిడెంట్ రామకృష్ణ, రాఘవేంద్రరావు, అప్పలరాజు తదితరులు ఉన్నారు.

అంతర్గత రోడ్లు అధ్వానం

- ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోని వైనం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



హెచ్‌ఎంటీహిల్స్ కాలనీలో అధ్వానంగా ఉన్న అంతర్గత రహదారులు



భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ హిల్స్ కాలనీలో ఒకవైపు అద్దంలాంటి రోడ్డు, మరోవైపు అధ్వానంగా అంతర్గత రహదారులు ఉండటం గమనార్హం. కాలనీ అన్ని రకాలుగా అభివృద్ధి చెందినప్పటికి కొన్ని అంతర్గత రహదారులు ఇప్పటికీ అధ్వానంగా ఉండటం పట్ల అక్కడి ప్రాంత ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజలు అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి నెలకొంది. రహదారులు గతుకులు, గుంతలమయం కావటంతో పాదచారులు, వాహనదారులు అనేక ఇక్కట్లకు గురవుతున్నారు.

◆ అవసరమున్నా లేకపోయినా ఇష్టానుసారంగా రోడ్లను తవ్వేస్తున్నారు. తిరిగి రోడ్లు పునర్‌నిర్మాణం చేయకపోవటంతో ఆ రోడ్లపై రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు తప్పటం లేదు. ఏ మాత్రం చిన్నపాటి వర్షం కురిసినా ఎక్కడా ఏ గుంత వుందో తెలియక భయాందోళ చెందుతున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనుల పేరుతో జాప్యం చేయటం వల్ల ఏళ్లుగా గతుకుల రోడ్లపైనే కాలనీ వాసులు కాలం వెళ్లదీస్తున్నారు.

◆ జేఎన్‌టీయూనుంచి ప్రగతినగర్‌కు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా హెచ్‌ఎంటీహిల్స్ కాలనీ ఉంది. కుడివైపు భాగంలో జరిగిన రోడ్ల నిర్మాణం మరోవైపు జరగకపోవటంతో ఇబ్బందులు తప్పటం లేదు. తమ కాలనీలో అభివృద్ధికి నోచుకోని పలు అంతర్గత రహదారుల సమస్యలను పరిష్కరించాలంటూ వారు అధికారులు, ప్రజాప్రతినిధులుకు విన్నవించినా ఫలితం లేదు. ఎన్నో ఏళ్ల క్రితంచేపట్టిన రోడ్లే ఇప్పటికి వాడుకలో ఉండటంతో అవి కాస్తా అభివృద్ధి పనుల నిమిత్తం తవ్వేసి గుంతలుగా ఏర్పడటంతో ప్రమాదకరంగా ఉన్నాయి. ఒకవైపు రోడ్డు, మరో వైపు మట్టి రోడ్ల ఉండటంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు సైతం రోడ్డు పైనే రాకపోకలు సాగించటంతో ఎప్పుడు ఏ ప్రమాదం పొంచి ఉన్నదో అని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నడిచేందుకు వీల్లేని పరిస్థితి...

హెచ్‌ఎంటీ హిల్స్ కాలనీలో కొన్ని అంతర్గత రహదారులు అధ్వానంగా తయారై నడిచేందుకు కూడా వీలులేని పరిస్థితి నెలకొంది. ఇష్టానుసారంగా రోడ్లను తవ్వి వదిలివేయటంతో గుంతలుగా మారి మరింత ఇబ్బందికరంగా మారింది.

◆ భూగర్భ డ్రైనేజీనిర్మాణ పనుల కోసం ఈ రహదారిలో పైపులైన్లను తీసుకువచ్చి ఇక్కడ వేసి నెలలు గడుస్తున్నాయి. అయినప్పటికి ఇప్పటికి పనులు ప్రారంభానికి నోచుకోవటం లేదు.

◆ రోడ్డు మధ్య కంకర తేలటంతో వాహనదారులు అదుపు తప్పి కింద పడిపోతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. రోడ్లు అధ్వానంగా ఉండటంతో అపరిశుభ్రత నెలకొని రోడ్డుకు ఇరువైపులా మట్టి కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆయా ప్రాంతాల్లో పర్యటించి రోడ్లను పునర్నిర్మించేందుకు చర్యలు చేపట్టాలి.

అభివృద్ధికి నోచుకోలేదు



అభివృద్ధి పనుల పేరుతో రోడ్లను తవ్వటమే తప్ప తిరిగి వాటిని పునర్నించటంలో అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదు. దీంతో ఆ ప్రాంతంలోని గృహ సముదాయాల వారు కంకరతేలి ఉన్న రోడ్లపైనే రాకపోకలు సాగిస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా నిర్మించిన ఈ రోడ్డు ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదు. జాతీయ రహదారికి కూతవేటు దూరంలో ఉన్న ఈ కాలనీలో రహదారిల దుస్థితి చూస్తే అభివృద్ధి ఎంత జరిగిందో తెలుస్తుందన్నారు.

– సీతారామరాజు, హైదర్‌నగర్

సీనియర్ సిటిజన్స్ అనుభవాలు అభివృద్ధికి నాందిగా నిలవాలి

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

సనత్‌నగర్: మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అసోసియేషన్‌తో పాటు ఆసరా కమిటీ తరుపున చేసిన సేవలకు సంబంధించి ఫొటోలతో ముద్రించిన బ్రోచర్‌ను ఆదివారం మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్స్ అనుభవాలు, ఆలోచనలు అభివృద్ధికి నాందిగా నిలవాలని ఆకాంక్షించారు. మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ ఇతర అసోసియేషన్లకు ఆదర్శంగా నిలిచేలా విభిన్న కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. 70 సంవత్సరాల పైబడిన వారిని సన్మానించి వారిలో ఉత్తేజాన్ని నింపడంతో పాటు తామున్నామన్న భరోసా కల్పించడం శుభపరిణామన్నారు. వివిధ అసోసియేషన్లకు చెందిన సీనియర్ సిటిజన్స్‌కు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తూ ఉల్లాసాన్ని ఇస్తున్న మోడల్ కాలనీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ సభ్యులు సుబ్బారెడ్డి, వెంకటేష్‌శర్మ, వైకేడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నూతన కమిటీ సభ్యులు..

సనత్‌నగర్: బల్కంపేట ఎల్లమ్మ–పోచమ్మ దేవస్థానం బోర్డు నూతన కమిటీ సభ్యులు అభివృద్ధికి సంబంధించి తమ ఆలోచనలను ఎప్పటికప్పుడు పంచుకోవడం ద్వారా మరింత అభివృద్ధికి ఆస్కారం ఉంటుందని మంత్రి తలసాని సూచించారు. ఎల్లమ్మ–పోచమ్మ దేవస్థానం బోర్డు నూతన కమిటీ సభ్యులు ఆదివారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కే సుబ్బరాజు, సరాఫ్ సంతోష్, యాదగిరి గుప్తా, పుష్పలతాశ్రీనివాస్ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టేలా చూస్తాం



భద్రసాయినగర్‌లో పర్యటిస్తున్న బీజేపీ నేత భరతసింహారెడ్డి

కుత్బుల్లాపూర్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. జీడిమెట్ల డివిజన్ పరిధిలోని భద్రసాయినగర్, బీరప్పనగర్‌లలో ఆదివారం పర్యటించిన ఆయన స్థానికంగా నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా భరతసింహారెడ్డి మాట్లాడుతూ.. సమస్యలను స్థానిక కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి దృష్టికి తీసుకువెళ్లి త్వలోనే రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టేలా చూస్తానన్నారు. కాలనీల అధ్యక్షులు యాకయ్య, వెంకటేష్, సాయి, కృష్ణారెడ్డి, కె.సంతోష్, సోమరాజు, మధు, కోటేశ్వర్‌రావు, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సీపీఐ



కార్యక్రమంలో పాల్గొన్న మనోచారి, కృష్ణ

బాలానగర్: సీపీఐ జాతీయ నాయకత్వం పిలుపు మేరకు ఆదివారం 'బీజేపీ హఠావో దేశ్‌కో బచావో'లో భాగంగా ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో కె. మనోచారి అధ్యక్షతన ఇంటింటికి సీపీఐ పాదయాత్ర శ్రీశ్రీనగర్, రాజీవ్‌గాంధీనగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూకట్‌పల్లి సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ హాజరై మాట్లాడారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా, రైతు, మహిళల, విద్యార్థుల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో డేవిడ్, నాగేందర్, చంద్రమ్మ, సావిత్రి, పార్వతి, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు

కేపీహెచ్‌బీకాలనీ: శ్రీ మదలర్మేల్ మంగా, పద్మావతి సమేత శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి వార్ల ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 22 నుంచి 26వ తేదీ వరకు శ్రీల ప్రైడ్ పార్కులో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కె. కొండల్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం 24వ తేదీ ఉదయం 10గంటలకు శాంతి కల్యాణం ఉంటుందన్నారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం 6.30గంటలకు విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, నివేదన, నీరాజనం, మంత్ర పుష్పాదులు, తీర్థప్రసాద వితరణ, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. శ్రీమాన్ కోసూరి రామకృష్ణమాచార్యులు ప్రత్యేక పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రారంభోత్సవం



మూసాపేట: ది చెన్నై సిల్క్ వై జంక్షన్ కూకట్‌పల్లి ఆవరణలో శ్రీ కుమరన్ తంగమాలిగై గోల్డెన్ డైమండ్స్ హాల్‌మార్కు సిల్వర్ జ్యువెలరీని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకుల మాట్లాడుతూ ప్రపంచ నలుమూలలా ఉన్న అందరూ గర్వించదగ్గ అన్ని నగలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఐరా సిల్వర్ జ్యువెలరీ 10శాతం రాయితీ, పేస్టేజీపై తయారీ చార్జీలు లేకుండా అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ఆర్ మహేష్, బ్రాంచ్ మేనేజర్ ఆర్. వర్ధనన్, మేనేజర్లు వినయ్, జోసఫ్, స్టాలిన్, త్యాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇటుక రాయితో మోది గుర్తు తెలియని వ్యక్తి హత్య



భాగ్యనగర్‌కాలనీ: ఓ గుర్తు తెలియని వ్యక్తిని దారుణంగా ఇటుక రాయితో కొట్టి హత్య చేసిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. కూకట్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుమారు 35 సంవత్సరాల వ్యక్తిపై భాగ్యనగర్‌కాలనీలోని బస్‌స్టాప్‌లో గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. కన్ను, తలపై తీవ్ర గాయాలు కావడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. సమాచారం అందుకున్న కూకట్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వ్యక్తిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



భాగ్యనగర్‌కాలనీ: వేగంగా దూసుకువచ్చిన ఓ ద్విచక్ర వాహనం ఢీకొట్టిన సంఘటనలో ఓ గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి సాగర్ హోటల్ సమీపంలో తెల్లవారుజామున ఓ గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలోనే మూసాపేట నుంచి కేపీహెచ్‌బీ వైపు ద్విచక్రవాహనంపై వేగంగా వెళ్తున్న వ్యక్తి అతడిని ఢీకొట్టాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరించగా గాయపడిన వ్యక్తి వద్ద ఎటువంటి ఆధారాలు లేవు. దీంతో అతడిని చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. డ్యూటీ డాక్టర్లు పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు పేర్కొన్నారు. డ్రైవింగ్ చేస్తున్న శరత్ మద్యం మత్తులో ఉండటంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని పోలీసుల నిర్ధారణకు వచ్చి వారిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హోల్‌సేల్ మార్కెట్లో రిటైల్ అమ్మకాలు

ఆందోళన చెపట్టిన రిటైల్ వ్యాపారులు



ఆందోళన చేస్తున్న రిటైల్ వ్యాపారులతో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ హారిక

ఓల్డ్ బోయిన్‌పల్లి: బోయిన్‌పల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో నిబంధనాలకు విరుద్ధంగా రిటైల్ వ్యాపారాలు కొనసాగిస్తున్నారని రిటైల్ కూరగాయల వ్యాపారులు ఆందోళన చేపట్టారు. గతంలో పలుమార్లు మార్కెట్ కమిటీ చైర్మన్, సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి చర్యలు లేకపోవడంతో నిత్యం కమీషన్ ఏజెంట్లు రిటైల్‌గా కూరగాయలు అమ్ముతుండటంతో ఆగ్రహం వ్యక్తం చేసిన రిటైల్ వ్యాపారులు ఆదివారం మార్కెట్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. మార్కెట్‌లో రిటైల్ వ్యాపారాలు నిలిపేయాలని నినాదాలు చేశారు. నిబంధనాలకు విరుద్ధంగా వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ హారిక, వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, సెక్రటరీ శ్రీనివాస్ హెచ్చరించారు. నిబంధనాలు పాటించని వారి లైసెన్సులను రద్దు చేస్తామన్నారు. మార్కెట్‌లో ఒక్కొక్క కమీషన్ ఏజెంట్ తనకు కేటాయించిన షాప్‌లో ఒక్కటే కాంటాను పెట్టుకుని వ్యాపారం చేయాలన్నారు. ఈ నిరసనలో రిటైల్ వ్యాపారులు రజనీకాంత్, అజం, నర్సింహా, పి.సత్యనారాయణ, డి.నర్సింగ్‌రావు, మక్కాల మైసయ్య, పి.సారయ్య, ఎం.కాలేష్, అండాళ్లు, ఉమా, పద్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

దుండిగల్: విద్యార్థులు గ్రాడ్యుయేట్లు కావడం వారి జీవితంలో సరికొత్త అధ్యయనాన్ని ప్రారంభించడమే అని ఓక్రిడ్జ్ ఇంటర్నేషల్ స్కూల్ ప్రిన్సిపాల్ బల్జిత్ ఒబెరాయ్ అన్నారు. ఆదివారం బాచుపల్లిలోని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో గ్యాడ్యుయేషన్ వేడుక అట్టహసంగా నిర్వహించారు. ఈ సంవత్సరం 90మంది విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి పట్టాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. తమ పాఠశాల విద్యార్థులు మిచిగాన్ స్టేట్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ మాంచెస్టర్, పెన్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ ఇలినాయ్ (చికాగో) వంటి ప్రతిష్టాత్మక యూనివర్సిటీల్లో ప్రతిభ కనబరచడంతో పాటు ప్లేస్‌మెంట్లు సాధించడం గొప్ప విషయమని అన్నారు. సీబీఎస్‌సీ హెడ్ నవనీత్ కౌర్ మాట్లాడుతూ.. విద్యార్థులు అందుకున్న యూనివర్సిటీ ఆఫర్లు వారి కృషి అంకిత భావాన్ని తెలియజేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐబీడీపీ ప్రోగ్రామ్ హెడ్ సాయికృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



హనుమాన్‌నగర్‌లో పర్యటిస్తున్న బీజేపీ సీనియర్ నాయకుడు గజ్జల యోగానంద్

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి ఆదివారం బీజేపీ సీనియర్ నాయకుడు గజ్జల యోగానంద్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాసమస్యలను పరిశీలించారు. కార్మికులు కర్షకుల కష్టాలు, చిరువ్యాపారుల బాధలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇన్ని సంవత్సరాలు అవుతున్నా అభివృద్ధి శూన్యమని అన్నారు. అబద్ధపు హామీలకు బ్రాండ్ అంబాసిడర్‌గా సీఎం కేసీఆర్ మారారని విమర్శించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ భూకబ్జాలతో కోట్లకు కోట్లు దోచుకుంటున్నారని ఆరోపించారు. సంక్షేమ ఫలాలు ప్రజలకు అందించడంలో విఫలమైన ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు మహేందర్, బీజేపీ నాయకులు రాజేష్, నరేందర్ రెడ్డి, భూపాల్‌రెడ్డి, పర్వతాలు యాదవ్, అక్కినపల్లి సాయికుమార్, గోవర్ధన్ చారి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత



క్రీడా పరికరాలు అందజేస్తున్న కార్పొరేటర్ మహేందర్

మూసాపేట: మూసాపేటలోని వార్డు కార్యాలయంలో మూసాపేట డివిజన్ యూత్‌కు బ్యాట్, బాల్, వికెట్స్, హ్యాండ్‌గ్లౌజ్, లెగ్ ప్యాడ్లు, ట్రైపాడ్స్‌లను కిట్ రూపంలో ఆదివారం కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువకులు ప్రతి ఒక్కరూ ఆటలు ఆడి శారీరక ధృడత్వాన్ని పెంచుకోవాలన్నారు. ఈ క్రికెట్ కిట్‌లను ప్రతి ఒక్కరు ఉపయోగించుకొని ఆటలు ఆడాలని యువకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పి.మనోహర్ రెడ్డి, వినోద్,శైలేష్, కిషోర్, సాయి, కృష్ణ ముదిరాజ్, కృష్ణయాదవ్, యాదయ్య, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు



కూకట్‌పల్లి: ఆల్విన్‌కాలనీలోని ఆదిత్యానగర్‌లో నిర్వహించిన బాడ్మింటన్ క్రీడల్లో విజేతలకు బహుమతులు ఆదివారం ప్రదానం చేశారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల పద్మారావు, గ్రేస్ సెక్యూరిటీ సర్వీసెస్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భాషా, రవి నిర్వాహకులుగా వ్యవహరించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతితులుగా గొట్టిముక్కల పద్మారావు, గుండాల రాఘవేంద్రరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులకు ప్రదానం చేసి క్రీడాకారులను అభినందించారు.

సంక్షిప్త వార్తలు

ఓయూ 106వ వ్యవస్థాపక దినోత్సవాలు షురూ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ 106వ వ్యవస్థాపక దినోత్సవాలు (ఫౌండేషన్ డే) 24 నుంచి 26 వరకు జరుగనున్నాయి. నేడు ఉదయం 6 గంటలకు 2కే రన్, 25న ఓపెన్ డే, 26న క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే ఉత్సవాలకు ఓయూ పూర్వ విద్యార్థి, చంద్ర గ్రహణం పైకి తొలిసారి అడుగిడిన రాకేష్‌శర్మ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు.

27న జాతీయ విద్య ఫిల్మ్ ఫెస్టివల్

ఉస్మానియా యూనివర్సిటీ:ఓయూలో 24వ జాతీయ విద్య ఫిల్మ్ ఫెస్టివల్ జరగనుంది. ఈ నెల 27న సీఈసీ-యూజీసీ ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సినీ దర్శకులు శేఖర్ కమ్ముల ముఖ్యఅతిథిగా హాజరవుతారని అధికారులు పేర్కొన్నారు. మూడ్రోజుల పాటు జరిగే ఫిల్మ్ ఫెస్టివల్‌లో 20 ఎడ్యుకేషన్ చిత్రాల ను ప్రదర్శించి ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి బ హుమతులను అందచేయనున్నట్లు వెల్లడించారు.

'ఓయూ వీసీ తీరు సరికాదు'

ఉస్మానియా యూనివర్సిటీ: పీహెచ్‌డీ ట్యూషన్ ఫీజుల పెంపును వ్యతిరేకిస్తూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల నేతలను ఇటీవల జరిగిన మహనీయుల జయంతి ఉత్సవాల ముగింపు సభలో వ్యక్తిగతంగా వీసీ ప్రొ. రవీందర్ దూషించడం దారుణమని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎల్ మూర్తి మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెంచిన పీహెచ్‌డీ ట్యూషన్ ఫీజును తగ్గించాలని గత పది రోజులుగా ఆందోళనలు చేస్తున్న విద్యార్థులకు సమాధానం ఇవ్వకుండా పరిశోధన విద్యార్థి ఏఐఎస్‌ఎఫ్ నాయకులు నెల్లిసత్య పై వీసీ చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేయకుండా పీహెచ్‌డీ ఫీజును తగ్గించాలని లేకుంటే ఆందోళనలు ఉద్ధృతం చేస్తామన్నారు.

రేపు ఉస్మానియా తక్ష్-2023

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఫౌండేషన్ డేను పురస్కరించుకొని రేపు (25న) తక్ష్-2023 కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలోని వివిధ కాలేజీల్లోని ఎగ్జిబిషన్లతో పాటు ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, లైబ్రరీలు, వర్క్‌షాప్‌లు, మ్యూజి యాలను ఉచిత సందర్శనార్థం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు తెరిచి ఉంచుతారని అధికారులు తెలిపారు.

నేటి నుంచి సమ్మర్ క్యాంప్

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ వైఎంసీఏలో ఈ నెల 24వ తేదీ నుంచి వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు జయకర్ డేనియన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. 5 సంవత్సరాల నుంచి 16 ఏళ్ల బాలాబాలికలు పాల్గొనవచ్చన్నారు. స్పోర్ట్స్, కల్చర్, ఇంటలెక్చువల్, యోగా లాంటి అనేక యాక్టివిటీస్ నిపుణుల పర్యవేక్షణలో శిక్షణ అందిస్తామన్నారు.

సాంకేతిక లోపంతో సినిమా నిలిపివేత

- థియేటర్ పై ప్రేక్షకుల దాడి

సనత్‌నగర్: మూసాపేటలోని ఏషియన్ లక్ష్మికళ థియేటర్ లో ప్రదర్శిస్తున్న 'విరూపాక్ష' సినిమా ప్రదర్శనలో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఆదివారం సాయంత్రం ఫస్ట్ షో నిలిపివేశారు. ఆగ్రహానికి గురైన ప్రేక్షకులు థియేటర్‌పై దాడి చేసిన ఘటన సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. టికెట్ తీసుకుని గంట సేపైనా సినిమా వేయకపోవడంతో కొందరు థియేటర్ లోని అద్దాలు ధ్వంసం చేశారు. సంఘటన అనంతరం ప్రేక్షకుల డబ్బును తిరిగి ఇచ్చారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు చేయలేదని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.